


# అందని ద్రాక్ష

కొండుముది రుక్మిణీదేవి

"కథ రాయాలని వుంది. కాయితాలు, కలం తెచ్చిపెట్టరా ?" వరండాలో కూర్చుని చదువుకుంటున్న కొడుకుని కేకేసింది తులసి.

ఆ మాట వాడికి వినపడిందో లేదో, సమాధానం చెప్పలేదు. పది నిముషాల తర్వాత మళ్ళీ పిల్చింది. అప్పుడూ ఉలుకూ, పలుకు లేదు. "ఛీ... వెధవ పిల్లలు." విసుక్కుంటు వచ్చి చూస్తే వాసు పుస్తకాలమీద తల పెట్టి నిద్రపోతున్నాడు. గడియారంవైపు చూసింది తులసి. తొమ్మిది కావొస్తున్నది. "నా ఆలోచనల్లో వుండి పిల్లాడికి అన్నం పెట్టలేదు. పాపం, మధ్యాహ్నం ఎప్పుడో తిన్నాడు. సాయంకాలం టిఫినుకూడా చెయ్యలేదు." అనుకుంటు వాడ్ని లేపి తీసుకువెళ్ళి అన్నంపెట్టి, పక్కేసి పడుకోబెట్టింది. మధ్యాహ్నం వచ్చిన ఉత్తరం మళ్ళీ గుర్తొచ్చింది తులసికి. తను వెంటనే కథ రాసి పంపించాలి. పాపం మరీ మరీ అడిగారు. ఆలోచిస్తునే ఉయ్యాల్లోకి తొంగి చూసింది. నాలుగునెల్ల పసికందు రాణి పక్క తడుపుకుని నిద్రపోతున్నది. చెప్పటంరాదు. ఇది కావాలని అడగలేదు. ఆ పసిగుడ్డుమీద జాలితోకూడిన ప్రేమ పెల్లుబికింది తులసికి.

తులసి భర్త శ్రీధర్ ప్రయివేటు కంపెనీలో పని చేస్తున్నాడు. పొద్దున పది గంటలు అయినా కాకుండానే ఇంటి నుండి వెళ్ళిన వాడు రాత్రి తొమ్మిది గంటలు దాటిన తరువాత ఎప్పుడో వస్తాడు. ఈ లోపుగా తులసికి క్షణం తీరిక వుండదు. ఇరుకుగా వుండే రెండు గదుల ఇల్లు. అస్తమానం సర్దినా పిల్లలు నానా ఖంగాళా చేస్తారు. పెద్దపిల్ల శశి శలవులిచ్చారని నాయనమ్మ దగ్గర కెళ్ళింది. వాసు రెండో తరగతి చదువుతున్నాడు. చంటిది రాణి. చాలీచాలని జీతం పని మనిషిని, చాకలిదాన్ని పెట్టుకుంటే సరిపోదు. అందుకనే కుడితిలో బడ్డ ఎలుకలాగా అస్తమానం చాకిరీతో కొట్టుకుపోతుంది.

తులసి చదివింది టెన్త్ క్లాసే అయినా మంచి ఆలోచనా శక్తి వుంది. పెళ్ళికాక ముందు ఒకటి రెండు కథలు రాసినా తల్లి తండ్రి ఏ పత్రికలకు పంపనివ్వలేదు. తన కూతురు తెలివి తేటలమీద నమ్మకం వున్నా, పటిష్టమైన సాంప్రదాయల ఆసరాగా జరిగే పెళ్లికి ఎక్కడ అవరోధం కలుగుతుందోనని ఆ పేద తండ్రి ఆరాటం. అందుకనే, "మనకెందుకమ్మా కథలు గ్రటా హాయిగా, కుట్లు, అల్లికలు నేర్చుకో ! వంట పని, ఇంటి పని సర్దుకో!" అనేవాడు. తులసి మనసులో ఎన్నో ఊహాలు మెదులుతున్నా స్వతంత్రించి వాటిని కాయితం మీద పెట్టలేక పోయింది. తులసికి భవిష్యత్తు మీద మంచి నమ్మకం వుంది. "తనకు అనుకూలుడైన భర్త దొరుకుతాడు. తన ఆశయాలు నెరవేరుస్తాడు తను చక్కగా కథలు రాసుకోవచ్చు." రచయిత్రిగా ఎదగాలని తనకెంతో కోరిక.

తన కోర్కెలు నెరవేరేరోజు అంత త్వరలో వస్తుందని అనుకోలేదు. పెళ్లయిన మొదటి రోజు, శ్రీధర్‌ని అడిగిన మొదటి ప్రశ్న "నేను కథలు రాయటం మీ కిష్టమేనా ?" అని

శ్రీధర్ ఆశ్చర్యంగా తన వైపు చూసి, "ఏమిటి ? కథలు రాస్తావా ?" అన్నాడు.

జరిగింది చెప్పింది తను. అందుకు అత నెంతగానో నొచ్చుకుని, "ఇకనుంచి తప్పకుండా రాయి. రైటర్స్ అంటే నాకు చాలా ఇష్టం. గౌరవం" అన్నాడు.

ఆ మాటలు తను చేరబోయే శిఖరానికి సోపానాల్లాగా తోచాయి. కాపరానికి వచ్చినరోజే చెప్పాడు, "ఇహనుంచి ఎటువంటి సంకోచం లేకుండా కథలు రాసుకో ! నీ ఇష్టంవచ్చినన్ని" అని.

ఆ మాటకు తులసికి నవ్వు వచ్చింది. "ఇష్టంవచ్చినన్ని రాసుకోవటానికి ఇవేం ఉత్తరాలా ?" అనుకున్నది మనసులో

"తులసీ !" తులసి ఆలోచన్లకు అంతరాయంగా శ్రీధర్ పిల్చాడు.

"వస్తున్నా" పక్క ఉదుటునవెళ్లి తలుపు తీసింది.

భారతి

సాహిత్య మాసపత్రిక

తెనుగువారి సంస్కృతికి ప్రతిబింబం

విడి పత్రిక : రూ. 4/-

# అందని ద్రాక్ష

"ఏంచేస్తున్నావ్ ? ఎంత పిలిచినా పలక లేదు. అప్పుడే నిద్రపోయావా ?"

"లేదండీ ! కథ రాద్దామని ... "

"కథ సంగతి తరువాత. ముందు నా ఆత్మా రాముణ్ణి సంతోషపెట్టు."

"అలాగేలెండి. పొద్దుటినుంచి ఈ పని అయిన తరువాత కలం తీద్దాం అనుకుంటూనే రాత్రి అయిపోయింది. ఇప్పుడిక తొందరేముంది. పదండి వడ్డిస్తాను" అంటూ వంట ఇంట్లోకి నడిచింది తులసి.

* * *

తులసి రాసిన కథకి ప్రైజు వచ్చింది. ఈ విషయం శ్రీధర్‌కి చాలా సంతోషం కలిగించింది. కించిత్ గర్వంగా కూడా ఫీలయ్యాడు. కానీ ... ఆ సంతోషం నలుగురికీ చెప్పుకోవటానికిలేదు. తననో వాజమ్మకింద కట్టేస్తారు. తను ఒక్కసారి గట్టి వార్నింగు ఇచ్చివుంటే ఇవ్వాల్టి తన ఆనందం నలుగురితోనూ పంచుకునేవాడు. కానీ, ఆనాడు, తనీ పని చెయ్యలేకపోయాడు.

"ఏమిటండీ ! మీలో మీరే నవ్వుకుని మహా ఆనందపడిపోతున్నారు" పక్కసీట్లో పనిచేసే ప్రసాదు అడిగాడు.

"ఏంలేదు. ఏదో కథలో సంఘటన గుర్తొచ్చి"

"కథ ఏమిటండోయ్! అన్నట్లు మీ ఆవిడ కథలు రాసేవారటగా ?"

"ఇప్పుడు కాదులెండి. ఒకప్పుడు" నాలిక్కరుచుకున్నాడు శ్రీధర్. ఇప్పుడు కూడా నిజం చెప్పలేకపోయాడు. ఆ వేళ ఇంతే ... వరసగా తులసి రాసిన రెండు కథలు పత్రికల్లో వచ్చినయ్ ! ఆనందంగా ఆఫీసులో వాళ్ళందరికీ చెప్పాడు.

ఆ మాట వినగానే, "వురేయ్ ! కథలు రాసేవాళ్ళు భూవిూ్మద నిలవర్రా ? ఊహల ప్రపంచంలోనే వుంటారు" అన్నాడు గిరి.

"అబ్బాయ్! నువ్వా చిన్నవాడివి, అనుభవం తక్కువ. కథలు రాసేవాళ్ళ మనసులూ తిన్నగా వుండవ్ ?" నర్మగర్భంగా అన్నాడు అవధాని.

"వురేయ్ ! నువ్వు ఇహ ఊరిమీద పడి పూటకూళ్ళ ఇల్లు వెతుక్కోవలసిందే ! మీ ఆవిడకు అన్నంవండే తీరిక ఎక్కడిదిరా" శర్మ వ్యంగ్యంగా అన్నాడు. తనకు తల కొట్టేసినంత పనయింది. మర్నాడు ఆఫీసుకు వెళ్ళగానే, "తులసిగారి భర్తకు కాఫీ కావాలేమో అడిగిరా" అంటూ ప్యూన్ను పంపించారు తన దగ్గరకు.

తనకోసం ఎవరో వస్తే "ఎవరూ ! తులసి మొగుడా ?" అన్నారెవరో ! "అదేమిటండీ ! శ్రీధరంగారు కావాలండీ." అన్నాడు వచ్చినతను.

"అదేనయ్యా ! ఆయన భార్య కథలు రాస్తుంది. తులసి అని..."

"ఏమిటండీ!? తులసి ఈయనగారి భార్యా ! నిన్నేదో పత్రికలో కథ పడ్డదని మా వాళ్ళందరూ వంతులేసుకుని చదివారు. చాలా బాగుందిట."

ఈ సంభాషణ అంతా వింటునే వున్నాడు శ్రీధర్. అయినా పెద్దగా పట్టించుకోలేదు.

మర్నాడు ఆఫీసుకు వచ్చీరాగానే, "ఏంవాయ్ ! ఎక్కడ మన మీల్సు. అచ్చమ్మ హొటల్లోనా ? బుచ్చయ్య కేఫ్‌లోనా ?"

"ఎందుకండీ ! మనవాడికి వంట రాకపోతే కదా ! వీడే వండి ఇంత తిని, వాళ్ళావిడకింత మూతపెట్టి వచ్చుండాలి."

"ఎక్కడ తింటే మనకేంల్లే ! ఆఫీసుకు వచ్చాడు."

ఇలాంటి మాటలతో జరిగిపోయాయి రెండు రోజులు. ఎందుకనో తనకూ చిన్నతనమనిపించింది. వాళ్ళన్న మాటలు చులకనగా తోచాయి. కానీ తులసి కథలు రాయాలి. ఆమె కథలంటే తనకూ ఇష్టమే ! మరి ఆఫీసులో... శ్రీధర్‌కి మెరుపులాంటి ఆలోచన వచ్చింది. ఇంటికి వెళ్ళగానే భార్యకు చెప్పాడు. మొదట్లో అందుకు ఆమె అంగీకరించలేదు. కానీ భర్త ప్రోత్సాహం తనకుండగా మరేదీ అక్కర్లేదనుకుని అందుకు ఒప్పుకున్నది.

"కపి" ఎన్నో కథలు, నవలలు రాసింది. ఆమె సీరియల్స్ అంటే ఆడ, మగ, పిల్లా పెద్దా, ముసలీ ముతకా అందరూ పడి పడి చదువుతారు. తులసి భర్తగా కాకుండా శ్రీధర్ శ్రీధర్‌గానే మిగిలాడు ఆఫీసులో.

"శ్రీధర్‌గారూ ! చూశారా ఈ కథ. 'కపి' రాసిందండీ ! ఈమధ్య ఆమె తెగ రాసేస్తున్నది. అయినా ఎంత వెరైటీ."

"ఈమధ్య బహుమతి కథలు బాగుండటం లేదు అనుకుంటున్నాం. కానీ... ఈ కథ వుంది చూశారూ! ఎంత సామాజిక స్పృహతో రాసిందో. ఇటువంటి కథలకు బహుమతులిచ్చి అప్పుడప్పుడు పత్రికలవాళ్ళు మంచివాళ్ళమనిపించుకుంటారు."

"ఆమె" అంటున్నారు. ఇంతకీ ఆడో, మగో తెల్సుకున్నారా ?"

"ఎవరైతేనేం. చక్కని కథలు వస్తున్నాయి."

"ఆ ! చూడండి శ్రీధర్‌గారూ ! ఆమధ్య మీ ఆవిడ రెండు కథలు రాసి అంతటితో ఆపేసిందేమిటి ? "కపి"కి పోటీగా తనూ రాయొచ్చుగా ! ఈనాడు రచయిత్రులంటే పాఠకుల కెంత అభిమానం, గౌరవం, సంఘంలో ఎంత మర్యాద. ఏమైనా అదో అదృష్టం. దేనికైనా పెట్టిపుట్టాలండీ !" నలుగురూ నాలుగు మాటలన్నారు.

"అందని ద్రాక్ష పుల్లన" అన్నారుగానీ, "అందని ద్రాక్ష తియ్యన." అంటే బాగుండేది అనుకున్నాడు. "కపి" మొగుడు శ్రీధర్ కపిగా! ఈ శ్రీధర్ భార్యే "కల్యాణతులసి" అని ఎవరికి తెలుసు పాపం ! ★